# చెద పురుగు

సాయంత్రం ఐదున్నరకి చేరుకోవలసిన ట్రెయిను రాత్రి తొమ్మి దింటికి చేరుకుంది. ఇలా జరుగుతుందని బయలుదేరేముందు ఊహించలేదు. ట్రెయిన్ సకాలంలో చేరివుంటే, ఆ వూరిలో నాకున్నపని ఒక గంటలో పూర్తిచేసుకుని, తొమ్మిదింటికి మళ్ళీ తిరుగుబండి అందుకొని ఉండేవాణ్ణి. ట్రెయిన్ లేటు కావడంతో అంతా తారుమారయింది. వచ్చిన చిక్కేమిటంటే ఆ వూరిలో లాడ్జి లేదు. మరీ చిన్న టౌను. నేను వెళ్ళవలసిన వ్యక్తి ఇంటికి-వేళకాని వేళలో వెళ్ళడం ఎందుకో బొత్తిగా మనస్కరించలేదు. వెళ్ళక రాత్రి ఎక్కడ గడపాలో అంతకన్నా తోచలేదు. ఇట్లా కొట్టు మిట్టాడుతూనే స్టేషన్ బయటికి వచ్చాను. ఒకే ఒక జట్కా ఉంది. బండివాడు నన్నుచూచి జట్కా దగ్గరికి తెచ్చి.

"రండి బాబూ, ఎక్కడికి పోవాలి?" అన్నాడు.

రోటిలో తలదూర్చి రోకటి పోటుకు వెరవడం బాగుండదు నాకు పనివున్న వ్యక్తి ఇంటికే వెళ్ళదలచుకున్నాను. కానీ ఆ వ్యక్తి పేరు జట్కావాడితో చెప్పడానికికూడా తటపటాయించాను. చుట్టూ చూశాను. జనం ఎవ్వరూ లేరు.

"శేషమాంబ యిల్లు తెలుసా?" గొంతు తగ్గించి అడిగాను. వాడు నావైపు అదోరకంగా చూసి, "కూర్చోండి" అన్నాడు.

కూర్చున్న తర్వాత బండి తోలుతూనే వాడు నావైపు పదే పదే చూస్తున్నాడు. వాడి దృష్టినుంచి తప్పించుకోవడానికి ముఖం వెనక్కి తిప్పి కూచున్నాను. ముళ్ళమీద కూచున్నట్టుంది.

జట్కా ఓ చిన్న మేడముందు ఆగింది. మేడకు చుట్టూ కాంపౌండు గోడవుంది. గేటు వేసేవున్నది. బండిదిగి ఆవిడను

ఎట్లా లేపడమో అర్థం కాక అయోమయంలో పడ్డాను. జట్కామనిషి నా స్థితి గమనించి నట్టున్నాడు.

“మీరు కొత్తా అమెకి?” కంఠంలో వ్యంగ్యం ధ్వనిస్తోంది. వాడు వేసిన ప్రశ్నకి నవ్వు వచ్చింది. కొత్తేనన్నట్టు తలూపాను. వాడు గేటుతీసి లోపలికి వెళ్ళి తలుపు తట్టాడు. కాసేపటికి లోపల అలికిడయింది. దీపాలు వెలిగాయి. తలుపు తీస్తూ, “ఎవరదీ?” అన్నది. ఆమె కంఠంలో నిద్రమత్తు ధ్వనిస్తోంది.

“నేను జట్కా ఖాసింని, ఏదో బేరం తలిగింది చూడు” అంటూ వాడు వెనక్కి తిరిగాడు.

వాడిచ్చిన జవాబుకు నాకు మూర్ఛ వచ్చినంత పనయింది. ముచ్చెమటలు ముంచెత్తిపోశాయి.

ఆమె తలుపుతీసి లోపలికి రండి అన్నట్టు కొంచెం పక్కకి తొలగి నిల్చుంది.

లోపలికి వెళ్ళగానే తలుపులువేసి మేడ మెట్లెక్కుతూ “రండి” అన్నది. ఆమె ఒయ్యారంగా మెట్లెక్కుతున్నది. పల్చటి ఫుల్ వాయిల్ చీరలో వంపులు చాలా స్పష్టంగా కన్పిస్తున్నవి. తెల్లటి ఒళ్ళూ, సన్నటి నడుమూ - అందమైన మనిషే.

మేడమీదికి వెళ్ళాక కుర్చీ చూపించి “కూర్చోండి” అన్నది. ఎదురుగ్గా మరో కుర్చీ వున్నది. కాని ఆవిడ కూర్చోలేదు. కుర్చీ పట్టుకుని అజంతా శిల్ప భంగిమలో నిలబడ్డది. అవయవ నిర్మాణంలో వున్న ఆకర్షణ ముఖంలో లేదు.

“ఏ వూరండీ మీది?” అన్నది నావైపు పరకాయించిచూస్తూ, వూరిపేరేకాదు. వచ్చినపని కూడా చెప్పాను. చప్పున చెప్పకపోతే ఆవిడకు నామీద మరో అభిప్రాయం కలగవచ్చు. నేను చెప్పింది విన్నాక ఆవిడ మంచం చూపి “ఇక్కడే పడుకోండి, ఉదయం మాటాడుకోవచ్చు” అంటూ కిందికి దిగిపోయింది.

గొప్ప రిలీఫ్ దొరికినట్లయింది. చుట్టూచూచాను. ఇల్లు క్రొత్తగా కట్టిందేమో గోడలు పరిశుభ్రంగా ఉన్నాయి. గోడలకు అక్కడక్కడా చౌకబారు క్యాలెండర్లు వున్నాయి. అక్కడక్కడ ఆమె ఫోటోలు వివిధ భంగిమల్లో వేలాడదీసి వున్నాయి. నాదృష్టి ఉన్నట్టుండి, ఒక ఫోటోముందు నిలిచింది. కళ్ళు తాటించి చూచాను. సందేహం లేదు. అది గోపాలరావుదే. గోపాలరావు రసికుడుకూడా నన్నమాట? లైటు ఆఫ్‌చేసి పడుకున్నాను. ఆలోచనలు గోపాలరావు చుట్టూ ముసురుకున్నాయి.

గోపాలరావుకు నన్ను ఎవరు పరిచయం చేశారో నాకు సరిగా జ్ఞాపకం లేదు. నిజానికి గోపాలరావును నేను ముందే ఎరుగుదును. ఆయన 'జనప్రియ' అన్న వారపత్రికకు సంపాదకుడు. ఖరీదయిన బట్టల్లో, ఖరీదైన మనుషుల్తో తిరిగేవాడు. ఎప్పుడూ సాహిత్య సభల్లోనూ రాజకీయ సభల్లోనూ తప్పకుండా కనిపించేవాడు. అలాంటి వాళ్ళు పదిమందికి తెలియడంలో ఆశ్చర్యమేముంది?

గోపాలరావుతో పరిచయమైన తరువాత రోడ్డుమీదనో బస్సులోనో కనిపిస్తే ఎందాక వెళ్తున్నారనో, ఎట్లావున్నారనో ప్రశ్నిస్తూనే వెళ్ళిపోయేవాడు. ఆయనవెంట పెద్దమనుష్యులుంటే అసలు చూచీ చూడనట్టే వెళ్ళేవాడు. అన్నీ గొప్పవాళ్ళ లక్షణాలు, బాగా డబ్బున్నవాడై వుంటాడు.

ఉన్నట్టుండి ఒకరోజు రోడ్డుమీద తారసిల్లి "మీరు కథా రచయితలటగా?" అన్నాడు ఆశ్చర్యంగా,

ఇన్నాళ్లూ నేను కథారచయితనని ఆయనకు తెలియదల్లేవుంది. "ఈ రోజుల్లో కథారచయితో, గేయకవో కానివాడెవడు లెండి" అన్నాను. గోపాలరావు పగలబడి నవ్వాడు. మీరుచెప్పేది నిజమే. పాఠకులకన్నా రచయితలే ఎక్కువవుతున్నారు. ఏ పత్రికయినా చూడండి. ఇవాళున్న రచయిత పేరు రేపు కనిపించదు. అంతా కొత్తకొత్తవాళ్ళు పుట్టుకొస్తున్నారు. కొన్నాళ్ళకి పాఠకుడన్నవాడు

మిగలకుండా, అంతా రచయితలే అయిపోయేటట్టుంది. యీ ఆంధ్ర దేశంలో" అన్నాడు.

"కానివ్వండి. అయితేమటుకు వచ్చే నష్టమేముంది. ఎలాగూ మంచికథలూ, గొప్ప కవిత్వమూ రాసేవాళ్ళు వేళ్ళమీద లెక్కపెట్ట గలిగినంతమందే వుంటారు. వాళ్ళ రచనల్లో గొప్పదనం గ్రహించ డానికి మామూలు పాఠకులన్నా ఒకమెట్టు పైనవుండాలి. దేశంలోని పాఠకులంతా రచయితలయితే కనీసం అందుకైనా ఉపయోగపడ తారు" అన్నాను. "సరే లెండి ఇప్పుడా విషయాలెందుకూ? మా 'జనప్రియ'కు ఈవారం ఓ కథరాసి ఇవ్వండి" అన్నాడు.

"చూద్దాంలెండి" అని తప్పించుబోయాను.

"చూద్దామంటే కుదరదు. ఇవాళ కథ పూర్తిచేసి రేపు ఉదయం ఆఫీసుకు తీసుకరండి. ఆఫీసు తెలుసుగా?" అన్నాడు.

కథలు రాయడం నాకు మంచినీళ్ళప్రాయ మనుకున్నట్టుంది. గోపాలరావు. లేకపోతే ఒక్కరోజులో కథ రాయడ మేమిటి?

రూం కొచ్చి పాత కాగితాలు వెతికితే ఎప్పుడో రాసివుంచిన కథ ఒకటి తగిలింది. ఫేర్ చెయ్యడానికి బద్ధకించి ఏ పత్రిక్కీ పంపలేకపొయ్యాను. తప్పనిసరిగ ఫేరోచేసి మరుసటిరోజు జన ప్రియ ఆఫీసుకు వెళ్ళాను.

గోపాలరావు వాకిట్లోనే ఎదురయ్యాడు, హడావిడిగా ఎక్క డకో వెళ్తున్నాడు. నన్నుచూచి "మాట తప్పకుండా కథ తెచ్చారల్లే వుంది. ఆఫీసులో ఇవ్వండి. మిమ్మల్ని కాసేపు కూచోబెట్టి కాఫీ ఇచ్చేందుకూడా టైం లేదు. తొమ్మిదిన్నరకి యమ్.ఎల్.ఏ. రంగా రెడ్డి గారింట్లో డిన్నరుంది. వీలయితే రేపురండి మాట్లాడదాం." అంటూనే టాక్సీ ఎక్కాడు.

కథ వినిపించి ఆయన అభిప్రాయం కనుక్కుందామను కున్నాను. గోపాలరావుకి టైంలేదు. కథ ఆఫీసులో ఇచ్చివచ్చాను.

తరువాత మూడురోజులు ఆఫీసుచుట్టూ ప్రదక్షిణ చేశాను. గోపాలరావు దొరకలేదు. ఆఫీసులో వాకబుచేస్తే, ఒకరోజు ఏ హెూటల్లోనో రమ్మీ ఆడుతున్నారు. మరోరోజు ఏ ఆఫీసరు వీడ్కోలుకో వెళ్ళాడన్నారు. ఇంకోరోజు ఏదో టీపార్టీకి. ఇన్ని వ్యాప కాలున్న మనిషి ఆఫీసు కుర్చీకి అతుక్కుపోవటమెలా కుదురుతుంది?

అయితే నేను మాత్రం ఆశ వదలుకోలేదు. మా ఆఫీసుకు వెళ్ళే దారిలోనే జనప్రియ ఆఫీసుంది. కనుక రోజూ అలా ఒకసారి ఆఫీసులోకి తొంగిచూస్తూనే వున్నాను.

నేను కథ యిచ్చిన పదిరోజులకు ఆయన ఆఫీసులో కనిపిం చాడు. నన్ను చూచి "రండి. నాకోసం చాలాసార్లు వచ్చారటగా ఈమధ్య? యేదీ క్షణం తీరికలేదు. జీవితంమీద విసుగు వస్తోం దంటే నమ్మండి" అంటూ గోపాలరావు ముఖం చిట్లించాడు.

"మీ కథ అచ్చయింది చూచారా?" అన్నాడు గోపాలరావు మళ్ళీ.

"ఆఁ ఆ కథ గురించి మీ అభిప్రాయ మేమిటో కనుక్కుందా మని వచ్చాను" అన్నాను.

"బావుంది. కథల విషయం నాకేం తెలుసునని" అన్నాడు.

"కూర రుచి చెప్పడానికి దాని పాకాన్నిగురించి తెలియవలసిన అవసరం లేదుగా?" అన్నాను.

"అది సరేననుకోండి, శిల్పం విషయం నాకు అట్టే తెలియదు. కథావస్తువు మరీ పేలవంగా వుంది, బొత్తిగా సెక్సువాసనలేదు. ఇప్పుడు ఇలాంటి కథలు ఎవరికి కావాలండి?"

గోపాలరావుగారి అభిరుచులు మరీ ఇంత చౌకబారుగా వుంటా యని నే నూహించలేదు. వాస్తవం తెలిసినాక నా కథలో వున్న శిల్పాన్ని గురించి, కంటెంటును గురించి, చెప్పడంకూడా అవివేకమే

ననిపించింది. కాసేపు అమాటా ఈమాటా మాటాడి సెలవు తీసుకొని బయటపడ్డాను.

తర్వాత మూడు నెలలపాటు నేను గోపాలరావుకి ముఖం చూపించలేదు. ఈలోగా రిట్రెంచ్‌మెంటు మూలాన వున్న ఉద్యోగం వూడింది. హైదరాబాదు వదలేముందు మళ్ళీ ఒకసారి గోపాలరావు కలిశాడు. రోడ్డుమీద వెళ్తుంటే నన్నుచూచి టాక్సీ ఆపి 'రండి' అంటూ ఆహ్వానించాడు. ఎక్కికూర్చున్నాను. తీరా టాక్సీ "మంజు" బారు ముందు ఆగిన తర్వాత నేను చేసిన పొరపాటు అర్థమయింది. టాక్సీ దిగి అయోమయంలో పడ్డాను.

"రండి కాసేపు కూచుని మళ్లీ వద్దాం" అన్నాడు.

"అబ్బే నా కలవాటులేదు. మీరు వెళ్ళండి."

"అలవాటు లేకపోతే వూరికే కూర్చుందురు రండి" అంటూ లోపలికి ఈడ్చుక పోయాడు.

లోపల కూర్చున్న తర్వాత "విస్కీ, బ్రాందీ యేదీ అలవాటు లేకపోతే బీరు పుచ్చుకోండి ఆరోగ్యానికి కూడా మంచిది" అన్నాడు.

"క్షమించండి. నాకు యేదీ అలవాటులేదు. మీరుకానివ్వండి" అన్నాను.

ఇక గోపాలరావు నన్ను బలవంతం చేయలేదు. వెయిటర్‌కు ఆర్డరిచ్చి, సిగరెట్టు వెలిగించి "ఇక చెప్పండి యేమిటి విశేషాలు? అన్నట్టు అడగటం మరచాను. మీ ఉద్యోగం పోయిందటగా-ఇక యేం చేద్దామనుకుంటున్నారు?" అని ప్రశ్నించాడు.

"యేం చేయడానికీ నేనింకా ఒక నిశ్చితాభిప్రాయానికిరాలేదు. పెట్టే బేడా సర్దుకొని ఇవాళ వూరికి వెళుతున్నాను. వూరికి వెళ్ళిన తర్వాత ఏం చేయాలో ఆలోచించవలసి ఉంటుంది" అన్నాను. గోపాలరావు ఏం మాట్లాడలేదు. విస్కీ గ్లాసు పెదవులకు కరిపిం

వాడు. నేను చూస్తూ కూచున్నాను. విస్కీ నోట్లో పడగానే హుషారుగా కనిపించాడు.

"రిట్రెంచ్‌మెంటు అంటే జ్ఞాపకం వస్తూంది. ఈవారం 'జనప్రియ'లో ఆ విషయం మీదే సంపాదకీయం రాశాను. చదివారా పత్రిక?"

నిజానికి ఆ పత్రిక ముఖం చూడక చాలా రోజులయింది. చూచిన పత్రికల్ని కూడా శీర్షికలు చూడటం తప్పించి—సాకల్యంగా ఎప్పుడూ చదవలేదు. చదవడానికి అందులో ఏదన్నా ఉంటుందని నేనెన్నడూ వూహించలేదు.

"లేదు. ఈమధ్య పత్రికను చూడలేదు" అన్నాను.

గోపాలరావు ఇంకోడోసు మింగి మరోసిగరెట్టు వెలిగించాడు.

"మీకు తెలీకపోవచ్చు. ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో రిట్రెంచ్‌మెంటుకు పూనుకుంది. ఆర్థికంగా సవాలక్ష ఇబ్బందులున్నై ప్రభుత్వానికి. ఇల్లాంటి పరిస్థితుల్లో ఏ ప్రభుత్వమయితే మట్టుకు ఏం చేస్తుంది చెప్పండి? చిత్రమేమిటంటే మీ యూనియన్స్ ప్రభుత్వాన్ని సానుభూతితో అర్థం చేసుకునేందుకు ఎప్పుడూ ప్రయత్నించవు. చీటికిమాటికి సమ్మెలూ, హర్తాళ్లు అంటూ అరాచక ధోరణుల్ని ప్రేరేపిస్తాయి."

గోపాలరావు "మీ యూనియన్స్" అన్న పదం నొక్కి పలికాడు. ఆయనకు ప్రభుత్వం మీదవున్న సానుభూతి, యూనియన్స్ పట్ల లేదు. వేలాది ఉద్యోగులు నిరుద్యోగులయ్యారు. వారికి రేపట్నుంచి భుక్తికి గ్యారంటీ లేదు. పస్తులూ, ఆత్మహత్యలూ-ఏం సంభవించినా ఆశ్చర్యం లేదు. ఐనా గోపాలరావుకు వారిపట్ల పిసరంతైనా సానుభూతిలేదు. పైపెచ్చు యూనియన్స్‌ని విమర్శిస్తున్నాడు. ఆయన ధోరణికి నాలో ఎక్కడలేని జుగుప్సా కలిగింది. నేను దానిని వ్యక్తం చేయలేదు. ఆయనతో వాదించి లాభంలేదు.

ఆయన జీవితం వడ్డించిన విస్తరి. నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలి. అవమానాలు – వీటిని గురించి ఆయనకు అర్థమయ్యేట్టు చెప్పడం కూడా కష్టం. లేని అనుభవాల అనుభూతుల్ని ఆయనలోకి ఇంజక్ట్ చెయ్యడం నా తలకు మించిన పని. నేను కిమ్మనకుండా కూర్చున్నాను. కాసేపట్లో గోపాలరావు బాటిల్ ఖాళీచేశాడు. నేను చెయ్యి ఆసరా ఇస్తే తప్ప లేవలేని లోకంలో ఉన్నాడు. తీసుకెళ్ళి టాక్సీ ఎక్కించి సెలవు తీసుకున్నాను.

అదే ఆయన్ని కడసారి చూడటం. ఊరికి వెళ్ళిన తరువాత మళ్ళీ ఉద్యోగ ప్రయత్నం చేయలేదు. వ్యవసాయం చేసుకోవటంలోనే హాయి అనిపించింది. ఇప్పుడు ఆయన ఫోటో ఎదురుగా కనిపిస్తే, గత స్మృతులు కళ్ళముందు మెదిలాయి. ఆ స్మృతులమధ్య ఏ ఒంటి గంటకో నిద్రపట్టింది,

ఉదయం ఏడింటికి లేచి కాఫీ తీసుకున్నాక శేషమాంబ వచ్చింది.

"ఇక చెప్పండి. ఏం నాటకమాడుతున్నారు?" అన్నది వస్తూనే.

"హరిశ్చంద్ర."

"మంచిదే మీరు యేదైనా వేషం వేస్తారా అందులో?"

లేదండీ. నేను స్కూలు కమిటీ ప్రెసిడెంటుని, ఈ నాటకం కూడా స్కూలు సహాయార్థం వేస్తున్నాం. .నటులంతా నాకు పరిచితులూ, మిత్రులూ."

"అయితే నే నొక్కదాన్నే నన్నమాట అపరిచితురాల్ని."

"మీరుకూడా ఇప్పుడు పరిచితుల కిందే లెక్క."

శేషమాంబ సన్నగా నవ్వింది. ఇక ఆవిడతో యేం మాట్లాడడానికీ తోచలేదు. అడ్వాన్సు డబ్బులు ఇచ్చి తేదీ కూడా చెప్పాను.

"ఆవిడ డబ్బులు తీసుకుంటూ మీరు నా గాత్రం వినకుండానే అడ్వాన్సు ఇస్తున్నారు. తీరా నాటకం రోజున విని బాధ పడవలసివస్తే నా బాధ్యతలేదు" అన్నది నవ్వుతూనే.

"మీ గాత్రం వినకపోయినా మీ గురించి విన్నాను. అందుకనే ఇంతదూరం" వచ్చాను.

నేను ఎంత అవసరం లేదన్నా ఆవిడ హార్మోనియం ముందు కూచుని నాలుగైదు పద్యాలు వినిపించింది. చక్కటి కంఠం. ఎంతో భావ యుక్తంగా చదివింది. కాని చదవడంలో లోపాలు లేకపోలేదు. మామూలు జనం వాటిని పట్టించుకోరు. వారికి కావలసింది రాగాలాపన.

ఆవిడ ఇంకా పాడటానికి సిద్ధంగా వుంది. టైం చూచాను. ఎనిమిదైంది. ఇక అర్ధగంటకు ట్రైనుంది.

లేచి, "ఇక వస్తానండీ" అన్నాను.

ఆవిడ గేటువరకు వచ్చింది. ఎందుకో చప్పున గోపాలరావు విషయం జ్ఞాపకం వచ్చింది.

"గోపాలరావు మీకు తెలుసా!"

అనవసర ప్రశ్న వేశానేమో ననిపించింది. వృత్తిరీత్యా ఆవిడకు ఎంతోమంది తెలిసి ఉంటారు. వారిని గురించి ప్రశ్నించడం సబబు కాదు. సభ్యత మరచి ఎలా ప్రశ్నించానో నాకే అర్థం కాలేదు. "మీకు తెలుసా?" ఆవిడ ఎదురుప్రశ్న వేసింది. "తెలుసు నేను హైదరాబాద్‌లో ఉండగా వారితో పరిచయమైంది."

"ఓహో అలాగా! గోపాలరావు నాకు స్వయాన అన్నయ్య. అప్పుడప్పుడు ఇక్కడికి వస్తూనే ఉంటాడు. నామీది అభిమానం తోటి కాదనుకోండి, నా డబ్బుకోసం."

ఆవిడ నవ్వుతూనే అన్నది. కాని ఆ నవ్వులో విషాదచ్ఛాయలు మిళితమై వున్నాయి.

ఒకసారి ఆమె ముఖంలోకి చూచాను. గోపాలరావు ఛాయలు స్పష్టంగా గోచరించాయి. శేషమాంబ, గోపాలరావు యేకోదరులు.

— —